సాక్షి సంగారెడ్డి
గురువారం । 26 । అక్టోబర్ । 2023



తండ్రీకొడుకుల మధ్య పోటీ

అందోల్ నియోజకవర్గ బీజేపీ టికెట్ కోసం తండ్రీకొడుకులు పోటీ పడడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

వివరాలు 10లో ▸



అంతా అరచేతిలోనే...

అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఈసీ తగిన ఏర్పాట్లు చేస్తోంది.

వివరాలు 10లో ▸



సంక్షేమం, అభివృద్ధిలో ఆదర్శం

పటాన్‌చెరు సంక్షేమం, అభివృద్ధిలో రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తోందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు.

వివరాలు 11లో ▸

న్యూస్‌రీల్

జిల్లాలో 208 ధాన్యం కొనుగోలు కేంద్రాలు

కలెక్టర్ శరత్



మాట్లాడుతున్న కలెక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్ : జిల్లాలో వానాకాలం 2023–24 సీజన్ ధాన్యం కొనుగోలుకు సర్వం సిద్ధం చేశామని సీఎస్ శాంతికుమారికి కలెక్టర్ శరత్ తెలిపారు. బుధవారం కలెక్టర్‌తో ఆమె టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. వానాకాలం ధాన్యం కొనుగోళ్లు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో 208 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా సీఎంఆర్ డెలివరీ 72 శాతం పూర్తయిందని చెప్పారు. త్వరితగతిన వంద శాతం పూర్తి అయ్యేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని సీఎస్‌కు వివరించారు. కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ మాధురి, సివిల్ సప్లయి డీఎం సుగుణ, డీఎస్‌ఓ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అభ్యర్థి భూపాల్‌రెడ్డి వాహనం తనిఖీ



భూపాల్‌రెడ్డి వాహనాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

నారాయణఖేడ్: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూపాల్‌రెడ్డి వాహనాన్ని అధికారులు తనిఖీ నిర్వహించారు. బుధవారం నిజాంపేట్ మండలం బాచేపల్లికి ఎన్నికల ప్రచారం నిమిత్తం కారులో వెళుతున్నారు. నిజాంపేట్ శివారులో వాహనాన్ని ఆపి పెద్దశంకరంపేట ఏఎస్‌ఐ సునీత, ఎన్నికల తనిఖీ టీం అధికారులు తనిఖీ చేశారు.


ఎన్‌హెచ్(151ఎ) రోడ్డు సర్వే ముమ్మరం



మనూరు శివారులో రోడ్డు సర్వే చేస్తున్న అధికారులు

మనూరు(నారాయణఖేడ్): ఎన్‌హెచ్ (151ఎ) రోడ్డు ఫైనల్ సర్వే పనులు వేగంగా కొనసాగుతున్నాయి. నిజాంపేట్ నుంచి బీదర్ వరకు ఈ పనులు చేపట్టనున్నారు. ఇప్పటికే రోడ్డు మార్కింగ్ పనులు పూర్తయ్యాయని అధికారులు పేర్కొన్నారు. బుధవారం మనూరు శివారులోని స్థానిక తండా వద్ద చివరి సర్వేలో భాగంగా నంబర్లు, రోడ్డు లొకేషన్‌ను ఆర్‌ఐ తాజొద్దీన్ పరిశీలించారు. మనూరులో 97 మంది రైతులకు సంబంధించిన భూముల గుండా రోడ్డు వెళుతోందన్నారు. ఇప్పటికే భూముల పొజిషన్, ఫొతి, మ్యుటేషన్ వివరాలను సేకరిస్తున్నామని వెల్లడించారు. మండలంలోని పుల్‌కుర్తి, బాదల్‌గాం, బెల్లాపూర్ శివారులో ఇప్పటికే మార్కింగ్ పూర్తి చేశామని సర్వేయర్ పృథ్వీ, సర్వే మేనేజర్ లక్ష్మణ్ తెలిపారు.

రూ.15 లక్షల వెండి వస్తువులు సీజ్



వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్న అధికారులు

మునిపల్లి(అందోల్): ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు చేపట్టిన తనిఖీల్లో సరైనా పత్రాలు చూపని రూ.15 లక్షల విలువైన వెండి ఆభరణాలను బుధవారం స్వాధీనం చేసుకున్నారు. మండలంలో ఉన్న కంకోల్ గ్రామశివారులో గల టోల్‌ప్లాజా వద్ద రాజస్థాన్ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును ఆపారు. తనిఖీ చేసి నరేందర్ సిర్వి(రాజస్థాన్) నుంచి వాటిని స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు తెలిపారు.

కురుమలు అన్ని రంగాల్లో రాణించాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కురుమలు అన్ని రంగాల్లో రాణించాలని ఉమ్మడి మెదక్ జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు బురగడ్డ నగేశ్ అన్నారు. బుధవారం అలయ్‌బలయ్ కార్యక్రమాన్ని సిద్దిపేటలో నిర్వహించారు. ఆరాధ్య దైవం బీరప్పదేవుడి చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు.

సునీతారెడ్డికి లైన్ క్లియర్

నర్సాపూర్ బీఆర్‌ఎస్ టికెట్‌పై వీడిన ఉత్కంఠ

- బీఫామ్ అందజేసిన కేసీఆర్
- అసంతృప్త నేతలను బుజ్జగించిన మంత్రి హరీశ్‌రావు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి/ నర్సాపూర్: బీఆర్‌ఎస్ నర్సాపూర్ నియోజకవర్గ టికెట్ సునీతారెడ్డికి అధిష్ఠానం ఖరారు చేసింది. ఆమె గెలుపు బాధ్యతలను సిట్టింగ్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డికే అప్పగించింది. క్షేత్రస్థాయిలోని ఆయన అనుచరులు సైతం విజయం కోసం పనిచేసేలా లైన్ క్లియర్ చేశారు. ఈ నియోజకవర్గంలో పార్టీ టికెట్ ఎవరికి ఖరారు చేస్తే వారి గెలుపు కోసం పని చేస్తామని ఇప్పటికే సుమారు 90 శాతానికి పైగా బీఆర్‌ఎస్ క్యాడర్ స్పష్టం చేసింది. నెలక్రితం తొలిజాబితాలో మదన్‌రెడ్డికి టికెట్ ఖరారు చేయకపోవడంతో శివ్వంపేట, కొడిపల్లి తదితర మండలాల్లో అసంతృప్తితో ఉన్న ఒకరిద్దరు ద్వితీయ శ్రేణి నాయకులతోనూ మంత్రి హరీశ్‌రావు మాట్లాడి స్వయంగా వారిని బుజ్జగించినట్లు సమాచారం. పార్టీ ప్రకటించిన అభ్యర్థి విజయం కోసం దిశానిర్దేశం చేసినట్లు గులాబీ పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

సస్పెన్స్‌కు తెర

బీఆర్‌ఎస్ నర్సాపూర్ అభ్యర్థిత్వంపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. టికెట్‌ను రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డికే ఖరారు చేస్తూ గులాబీ బాస్ కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. బుధవారం ప్రగతిభవన్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో కలిసి ఆమెకు బీఫామ్ అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా 115 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన సీఎం.. నర్సాపూర్‌తోపాటు మరో మూడు నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించనేలేదు.



నర్సాపూర్: యాదగిరిగుట్టలో లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుంటున్న సునీతారెడ్డి

దీంతో నెలరోజులపాటు ఈ టికెట్ విషయమై ఉత్కంఠ కొనసాగింది. రాష్ట్రవ్యాప్తంగా సిట్టింగ్ ఎమ్మెల్యేలందరికీ టికెట్లు ఖరారు కాగా, నర్సాపూర్ విషయంలో మాత్రం సిట్టింగ్ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డికి కేటాయించలేదు. దీంతో ఆయన తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. తనకే టికెట్ కేటాయించాలని నిరసన తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో వచ్చే ఎన్నికల్లో పోటీలో ఉంటానని కూడా ప్రకటించారు. మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ పలుమార్లు బుజ్జగించే ప్రయత్నాలు చేశారు. మదన్‌రెడ్డి పలుమార్లు ప్రగతిభవన్‌కు వెళ్లి రెండు, మూడు పర్యాయాలు సీఎం కేసీఆర్‌ను కూడా కలిశారు. ఎట్టకేలకు బుధవారం టికెట్‌ను సునీతారెడ్డికి కేటాయిస్తూ బీఫామ్ అందజేశారు. మదన్‌రెడ్డికి ఎంపీగా అవకాశం కల్పిస్తామనే హామీ ఇచ్చినట్లు గులాబీ పార్టీ శ్రేణుల్లో ప్రచారం జరుగుతోంది. మరోవైపు ఈ టికెట్ తనకే వస్తుందని మొదటి నుంచి సంకేతాలున్న ఆమె నియోజకవర్గంలో పలు కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. పరామర్శలు, శుభకార్యాలు పేరిట క్యాడర్ వద్దకు వెళుతున్నారు.

నరసింహస్వామిని దర్శించుకున్న సునీతారెడ్డి

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామిని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి బుధవారం రాత్రి దర్శించుకున్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థిగా సునీతారెడ్డిని సీఎం కేసీఆర్ ఖరారుచేసి బుధవారం మధ్యాహ్నం బీఫామ్ అందజేసిన విషయం తెలిసిందే. బీఫామ్ అందుకున్న ఆమె యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనర్సింహస్వామికి పూజలు చేసి తన మొక్కు చెల్లించుకున్నారు. పూజలో ఆమె బంధువులతో పాటు పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ నాయకులు ఆమెను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రొఫైల్..

పేరు:	వాకిటి సునీతారెడ్డి
పుట్టిన తేదీ:	5-4-1968
పుట్టిన స్థలం:	సికింద్రాబాద్
భర్త పేరు:	దివంగత వాకిటి లక్ష్మారెడ్డి
విద్యార్హతలు:	బీఎస్సీ, వనితా మహిళ విద్యాలయం, హైదరాబాద్

రాజకీయ ప్రస్థానం: 1999లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ నర్సాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలిచి.. ప్రత్యర్థి అయిన సీపీఐ అభ్యర్థి చిలుముల విఠల్‌రెడ్డిపై గెలుపొందారు. 2004, 2009ల్లో జరిగిన వరుస ఎన్నికల్లో గెలుపొంది హ్యాట్రిక్ సాధించారు. 2000–02 వరకు రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. 2002–04 వరకు మెదక్ జిల్లా కమిటీ కన్వీనర్‌గా కొనసాగారు. 2009లో రాష్ట్ర సాగునీటి పారుదల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 2010–14 వరకు శిశుసంక్షేమ శాఖ మంత్రిగా పనిచేశారు. 2014– 19లో మెదక్ డీసీసీ అధ్యక్షురాలిగా ఉన్నారు. 2019లో బీఆర్‌ఎస్‌లో చేరారు. ప్రస్తుతం రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

‘గృహలక్ష్మి’ బాధ్యత నాదే

- అర్హుల దరిచేరుస్తాం
- సంగారెడ్డిలో గులాబీ జెండా ఎగరడం ఖాయం
- ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు
- ఎమ్మెల్యే జగ్గారెడ్డి.. ప్రజలకు అందుబాటులోఉండరని విమర్శ

సదాశివపేట/సంగారెడ్డి/కంది : ఇళ్ల స్థలాలున్న అర్హులైన పేదలకు గృహలక్ష్మి పథకం కింద గృహాలు మంజూరు చేయించే బాధ్యత తనదేనని ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు భరోసా ఇచ్చారు. బుధవారం పట్టణంలో ఉన్న ముర్షత్ దర్గా ఆవరణలో మనబీన్ ఫౌండేషన్ చైర్మన్ ఎంఏ ముఖీం భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంత్రి హరీశ్‌రావు సమక్షంలో తన అనుచరులతో ఆయన బీఆర్‌ఎస్‌లో చేరారు. సంగారెడ్డిలోనూ.. పట్టణంలో ఉన్న నల్సాబ్ గడ్డలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ నుంచి జమాల్, సయ్యద్ మన్సూర్ తదితరులు పార్టీలో చేరారు. కంది మండల పరిధిలోని ఎద్దు మైలారంలో కాంగ్రెస్ నాయకులు శివకుమార్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలో మళ్లీ బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం తథ్యమన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థిగా చింతా ప్రభాకర్ గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేగా జగ్గారెడ్డి ప్రజలకు అందుబాటులో ఉండరని విమర్శించారు. నియోజకవర్గంలో ఉన్న పట్టణాలు, గ్రామాల్లో ఎన్నిసార్లు ఆయన వచ్చారని ప్రజలను ప్రశ్నించగా, రాలేదని జవాబునిచ్చారు. ప్రభాకర్ ఆరోగ్యం బాగా లేకున్నా నిత్యం ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రజాసంక్షేమ పథకాల అమలుకు నిరంతరం శ్రమిస్తున్నాడని కొనియాడారు. ఇలాంటి వ్యక్తిని ఆశీర్వదించి గెలిపించాలని అభ్యర్థించారు. రాష్ట్రంలో ఉన్న అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని పేర్కొన్నారు. రెండు వేల పింఛన్లు ఇస్తున్నది కేసీఆర్‌యేనని అన్నారు. ఇప్పుడు దానిని రూ.ఐదు వేలకు చేయబోతున్నామన్నారు. మహిళలకు రూ.మూడు వేలను ఇవ్వబోతున్నామన్నారు. ముందుగా శంభులింగేశ్వర మందిరం నుంచి ముర్షత్ దర్గా వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, సంగారెడ్డి ఎన్నికల ఇన్‌చార్జీలు ఎర్రోళ్ల శ్రీనివాస్, భూపాల్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరిరెడ్డి, సీడీసీ చైర్మన్ కసాల బుచ్చిరెడ్డి, టీజేఏసీ జిల్లా చైర్మన్ సత్తయ్య యాదవ్, సంగారెడ్డి ఏఎంసీ చైర్మన్ ప్రభుగౌడ్, టీఎన్‌జీఓ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు రాజేందర్, సదాశివపేట మున్సిపల్ చైర్మన్ పిల్లోడి జయమ్మ, వైస్ చైర్మన్ చింతా గోపాల్, మనబీన్ ఫౌండేషన్ సభ్యులు, బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సదాశివపేట సభలో మాట్లాడుతున్న మంత్రి తన్నీరు హరీశ్‌రావు

సోషల్ మీడియా సెల్ యాక్టివేట్

- ఎన్నికల అంశాలను నిశితంగా పరిశీలించాలి
- రోజూ సీఈసీకి నివేదికలు పంపాలి
- అదనపు కలెక్టర్ చంద్రశేఖర్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి టౌన్ : సోషల్ మీడియాలో వచ్చే ఎలక్షన్ రిలేటెడ్ అంశాలను నిశితంగా పరిశీలించాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఉన్న తన చాంబర్‌లో సోషల్ మీడియా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోషల్ మీడియా కమ్యూనికేషన్ ప్లాట్‌ఫామ్స్ ద్వారా వివిధ రకాల విషయాలపై పోస్ట్ చేస్తుంటారన్నారు. అందులో ముఖ్యంగా ఎన్నికలకు సంబంధించిన అంశాలను గుర్తించాలని సూచించారు. ఎలక్షన్ క్యాంపెయిన్‌లో భాగంగా అభ్యర్థులు సోషల్ మీడియా ప్లాట్ ఫామ్స్ ద్వారా వీడియోలు, ఫొటోలు, వాయిస్ రికార్డ్, మెసేజ్‌లు, పోస్టర్లు పాంప్లేట్ల ద్వారా ప్రచారం చేసుకుంటారన్నారు. ఈ సెల్‌కు సంబంధించిన అధికారులు, సహాయ సిబ్బంది రోజూ పూర్తిస్థాయిలో ఇందులో పోస్టు చేసిన అంశాలను అన్నింటినీ పరిశీలించాలన్నారు. జిల్లాకు సంబంధించి అభ్యర్థులు రెచ్చగొట్టేలా ఉన్నా, వ్యక్తిగత దూషణలు, తప్పుడు వార్తలు ప్రసారం, ప్రచురితం చేయడం లాంటివి ఉన్నట్లయితే వెంటనే మోడల్ కోడ్ అధికారికి పంపాలని సూచించారు. ఆయా వేదికల ద్వారా ఎన్నికల నియమావళి ఉల్లంగించినట్లయితే వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆయా నివేదికలను రోజూ సీఈఓకు పంపాలన్నారు. ఎంసీసీ, ఎంసీఎంసీ(మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ), మీడియా, సోషల్ మీడియా సెల్, కంట్రోల్ రూమ్, ఎక్స్‌పెండెచర్ మానిటరింగ్ అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేయాలన్నారు. సోషల్ మీడియా సెల్ యాక్టివేట్‌గా ఉండాలని చెప్పారు. ఎన్నికలకు సంబంధించి ఏవైన ఉల్లంఘనలు జరిగినట్లయితే ప్రజలు నిర్భయంగా సోషల్ మీడియా కంట్రోల్ రూమ్‌కు వాట్సాప్ ద్వారా తెలియజేయవచ్చని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో నోడల్ అధికారులు సురేష్ మోహన్, రాధాబాయి, విజయలక్ష్మి, ఈడీఎం ఉదయ్ కుమార్, సహాయ అధికారులు పాల్గొన్నారు.

ఇంటి సమీపాన మద్యం తాగొద్దన్నందుకు..

వ్యక్తి దారుణ హత్య

- పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు
- బొల్లారం మున్సిపల్ పరిధిలో ఘటన



అజీమ్

జిన్నారం(పటాన్‌చెరు): ఇంటి సమీపాన మద్యం తాగడం సరికాదని ఓ వ్యక్తి, ముగ్గురితో అన్నందుకు గాను దారుణంగా హత్య చేశారు. ఈ ఘటన మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలో మంగళవారం రాత్రి వెలుగుచూసింది. సీఐ నయీముద్దీన్ కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా నర్సంపేట మండలం చంద్రయ్యపల్లి వాసి అజీమ్(35). బొల్లారంలోని గాంధీ నగర్‌లో నివాసముంటూ ఓ పరిశ్రమలో పని చేస్తున్నాడు. మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో బయటకు వచ్చి వాకింగ్ చేస్తున్నాడు. ఇంటికి సమీపంలో ముగ్గురు మద్యం తాగడాన్ని గమనించాడు. రాత్రి సమయంలో ఇక్కడ మద్యం తాగడం సరైంది కాదని లక్ష్మణ్, విశాల్, మన్నూ కుమార్‌తో అజీమ్ దురుసుగా చెప్పాడు. దీంతో ఆగ్రహించిన వారు అతడిపై ఉమ్మడిగా దాడికి తెగబడ్డారు. పక్కనే ఉన్న బండ రాయితో తలపై మోదగా అక్కడికక్కడే అతను ప్రాణాలు విడిచాడు. ఈ విషయాన్ని సమీపంలోకి వ్యక్తులు.. పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు నిందితులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ తరలించారు. అజీమ్‌ను కావాలనే హత్య చేసి ఉంటారని, గతంలో సైతం గొడవలు జరిగాయని పలువురు అంటున్నారు.

‘ఈటలకే మా మద్దతు’

గజ్వేల్: నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల్లోని అసంతృప్త నేతలు బీజేపీలో చేరేందుకు రంగం సిద్ధమైంది. బీఆర్‌ఎస్‌లో కొంత కాలంగా అసమ్మతి గళాన్ని వినిపిస్తున్న మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ టేకులపల్లి రాంరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సింగం సత్తయ్య, సీనియర్ నాయకులు చెట్టి సురేష్‌గౌడ్, పిడిచెడ్ వెంకటరెడ్డి, కొన్నె రాజిరెడ్డి, మాజీ సర్పంచ్ రాచంద్రారెడ్డి, మాజీ కౌన్సిలర్ బోస్ తదితరులు బుధవారం బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. కేసీఆర్ నియోజకవర్గంలో మొదటి నుంచి పార్టీలో ఉన్న నేతలను పట్టించుకోవడంలేదని, అవమానాలకు గురిచేస్తున్నారని, భరించలేకే తాము బీజేపీలో చేరి ఈటల రాజేందర్‌ను గెలిపించడానికి నిర్ణయించుకున్నట్లు స్పష్టం చేశారు.

జిల్లా బహిష్కరణ తప్పదు



మాట్లాడుతున్న ఎస్పీ రూపేష్

- అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు
- రౌడీషీటర్లకు ఎస్పీ హెచ్చరిక

పటాన్‌చెరు టౌన్/ సంగారెడ్డి : రౌడీయిజానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, నేరాలు మానేసి సంతోషంగా జీవించాలని ఎస్పీ రూపేష్ అన్నారు. బుధవారం పటాన్‌చెరు మండలం కర్దనూర్ లో ఉన్న ఫంక్షన్ హాల్‌లో రౌడీషీటర్లు, పాత నేరచరిత్ర కలిగి ఉన్న వారికి రాబోవు ఎన్నికల నేపథ్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. సంగారెడ్డిలోనూ.. గోకుల్ ఫంక్షన్ హాల్లో సమావేశం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో ఎవరైనా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా.. ఎవరినైన బెదిరించినా.. ఇబ్బంది పెట్టినా.. వారిని జిల్లా బహిష్కరణ చేస్తామన్నారు. పీడీ యాక్ట్‌తోపాటు కఠిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సత్ప్రవర్తన కలిగి ఉన్న వారిని ఎన్నికల అనంతరం డిసెంబర్‌లో మేళా నిర్వహించి రౌడీషీట్లను తొలగిస్తామన్నారు. కార్యక్రమాల్లో పోలీసులు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మద్యం, నగదు అక్రమ రవాణాపై ఉక్కుపాదం

సంగారెడ్డి : జిల్లాలో ఎన్నికల కోడ్ పక్కాగా అమలు చేస్తున్నామని ఎస్పీ రూపేష్ అన్నారు. సీసీఎస్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ మహేశ్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ టీంగా ఏర్పడి జిల్లావ్యాప్తంగా అక్రమంగా తరలిస్తున్న మద్యం, డబ్బు రవాణాపై బుధవారం దాడులు నిర్వహించారు. ఇందులో జహీరాబాద్ రూరల్ సర్కిల్ పరిధిలో సుమారు 25 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఐడీఏ బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన దాడుల్లో అక్రమంగా మద్యాన్ని అమ్ముతున్న సీహెచ్. గౌతమ్, కె.నరేశ్ నుంచి 63.5 లీటర్లను స్వాధీనం చేసుకున్నారు. ఆపై సీజ్ చేసి కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు.

103 పోలింగ్ కేంద్రాలు

- రామచంద్రాపురం మండలంలో కొత్తగా పదింటిని ఏర్పాటు చేసిన అధికారులు
- మౌలిక వసతులకు ప్రాధాన్యం



ఉస్మాన్‌నగర్ మోడల్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

రామచంద్రాపురం (పటాన్‌చెరు): సార్వత్రిక ఎన్నికలకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. అందులో భాగంగా పెరిగిన జనాభాకనుగుణంగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మౌలిక సదుపాయాల కల్పనలో నిమగ్నమయ్యారు. 2018లో రామచంద్రాపురం మండల పరిధిలో 93 పోలింగ్ కేంద్రాలు ఉండగా ఇప్పుడు 103 కేంద్రాలకు పెంచారు. కొత్త వాటితో కలిపి రామచంద్రాపురం డివిజన్‌లో 35, భారతీనగర్ డివిజన్‌లో 32, తెల్లాపూర్ డివిజన్‌లో 28, పటాన్‌చెరు డివిజన్ పరిధిలో ఉన్న బండ్లగూడలో 8 కేంద్రాలను ఏర్పాటు చేశారు. అందులో రామచంద్రాపురం, భారతీనగర్, తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో పెరిగిన ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా 10 కొత్త పోలింగ్ కేంద్రాలు అందుబాటులోకి వస్తున్నాయి. ఈ విషయమై గతనెల కేంద్ర ఎన్నికల సంఘం అధికారుల సైతం మండలంలో పర్యటించారు. అప్పుడు పోలింగ్ కేంద్రాలను పెంచాలని స్థానికులు వారికి విన్నవించారు. స్థానిక అధికారులు సైతం వాటిలో మౌలిక సౌకర్యాలు ఉన్నాయో? లేవో? తెలుసుకునేందుకు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. ర్యాంప్‌లు, తాగునీటి వసతి, మరుగుదొడ్లు, విద్యుత్ సరఫరా, పోలింగ్ కేంద్రాల భవనాలకు ఎర్తింగ్ కనెక్షన్ తదితరాలను పరిశీలిస్తున్నారు.

గత ఎన్నికల్లో.. పలుచోట్ల ర్యాంపులు పెద్దగా లేకపోవడంతో వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాటిని దృష్టిలో పెట్టుకొని కేంద్రాలకు వచ్చే వృద్ధులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పలు కేంద్రాల్లో విద్యుత్ సమస్యతోపాటు ర్యాంప్‌లు సరిగా లేకపోవడాన్ని అధికారులు గుర్తించారు. వాటిని వీలైనంత త్వరలో సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. మోడల్ పోలింగ్ కేంద్రాలను ఎంపికకు కూడా సిద్ధమవుతున్నారు.

ఓటింగ్ శాతం పెరిగే చాన్స్



తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని అనేక కొత్త కాలనీలు వెలిశాయి. కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు ఇటీవల ఇక్కడికి రాగా కాలనీ అసోసియేషన్ సభ్యులతో సమావేశం అయ్యారు. పెరిగిన ఓటర్లకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాలను పెంచాలని కోరాం. ఓటర్లకు సమీపంలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తే ఓటింగ్ శాతం పెరిగే అవకాశం ఎక్కువగా ఉంటుంది. – ఈశ్వరగారి రమణ, తెల్లాపూర్ నైబర్హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు


సమస్యలను పరిష్కరిస్తున్నాం



రామచంద్రాపురం మండల పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నాం. పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు లేకుండా వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నాం. – సంగ్రామ్ రెడ్డి, తహసీల్దార్, రామచంద్రాపురం

తండ్రీకొడుకుల మధ్యే పోటీ


మాజీ మంత్రి బాబూమోహన్




ఉదయ్

అందోలు బీజేపీ టికెట్‌పై ఉత్కంఠ
- మొదటి జాబితాలో బాబూమోహన్‌కు మొండి చేయి
- కుమారుడు ఉదయ్ సైతం ధీమాతోనే..

జోగిపేట(అందోల్): అందోలు నియోజకవర్గ బీజేపీ టికెట్టు కోసం తండ్రీకొడుకులు పోటీ పడడం స్థానికంగా చర్చనీయాంశమైంది. మొదటి నుంచి కుటుంబ సభ్యులను రాజకీయాలకు దూరంగా ఉంచే మాజీ మంత్రి బాబూమోహన్ టికెట్ల కేటాయింపు సమయంలో కుమారుడు ఉదయ్‌బాబూమోహన్ పేరు తెరపైకి రావడాన్ని ఆయన వర్గీయులు జీర్ణించుకోలేకపోతున్నారు.

- అందోలు ఎమ్మెల్యేగా 1998లో జరిగిన ఉప ఎన్నికల్లో గెలుపొంది, 1999 సాధారణ ఎన్నికల్లో తిరిగి రెండోసారి టీడీపీ పార్టీ తరఫున ఎమ్మెల్యేగా ఎన్నికై నియోజకవర్గంలో పట్టు సాధించారు. 2004, 2009 ఎన్నికల్లో మాజీ డిప్యూటీ సీఎం దామోదర్ రాజనర్సింహా చేతిలో బాబూమోహన్ ఓడిపోయారు.
- రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014లో బాబూమోహన్ బీఆర్ఎస్ పార్టీలో చేరి ఎమ్మెల్యేగా గెలుపొందారు.
- 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్ టికెట్‌ను నిరాకరించడంతో బీజేపీ పార్టీలో చేరి ఆ పార్టీ తరఫున పోటీ చేసి ఓడిపోయారు.
- ప్రస్తుతం 2023 ఎన్నికల్లో బీజేపీ 52 మంది అభ్యర్థులతో ప్రకటించిన జాబితాలో బాబూమోహన్ పేరు లేదు. ఆయన కుమారుడు ఉదయ్‌బాబూమోహన్ పేరును పార్టీ అధిష్ఠానం పరిశీలిస్తున్నందని, అందుకే మొదటి జాబితాలో అవకాశం దలేదని పార్టీ వర్గాలు అంటున్నాయి.
- ఉదయ్‌బాబూ మోహన్ పేరును బీజేపీ తరఫున కేటాయిస్తున్నట్లు ప్రముఖ టీవీల్లో ప్రచారం కావడంతో నియోజకవర్గంలో చర్చించుకుంటున్నారు. రెండు మాసాల క్రితం పార్టీ సీనియర్ నాయకుడు జితేందర్‌రెడ్డి అందోలు టికెట్‌ను ఉదయ్‌బాబుకు ఇద్దామని బాబూమోహన్‌తో అన్నట్లు పార్టీ నాయకులు మాట్లాడుకుంటున్నారు.
- అప్పటి నుంచి ఉదయ్‌బాబును నియోజకవర్గానికి దూరంగా ఉంచేందుకు బాబూమోహన్ ప్రయత్నిస్తున్నట్లు నాయకులు చెబుతున్నారు. అందోలు బీజేపీ టికెట్‌ను మాజీ జెడ్పీ చైర్మన్ బాలయ్య కూడా ఆశిస్తున్న విషయం తెలిసిందే.
- అందోలు టికెట్ తనకే కేటాయించాలని పార్టీ అధిష్ఠానవర్గంపై బాబూమోహన్ ఒత్తిడి తెస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ టికెట్‌పై తండ్రీకొడుకుల మధ్యే పంచాయితీ ఏర్పడే అవకాశం ఉందని స్థానికులు భావిస్తున్నారు.

పొన్నం వర్సెస్ అల్గిరెడ్డి

కాంగ్రెస్ అధిష్ఠానం టికెట్ల కేటాయింపులో మొదటి లిస్టులో హుస్నాబాద్‌కు చోటు ఇవ్వలేదు. రేపో మాపో రెండో లిస్ట్ విడుదల చేసే అవకాశం ఉంది. టికెట్ ఖరారు కాకముందే మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డిలు రాజకీయ వేడిని పుట్టిస్తున్నారు. టికెట్ నాకే అంటే నాకే అని ఎక్కడ తగ్గేదేలే అన్నట్లు ఎవరి కార్యక్రమాలు వారు చేసుకుంటూ పోతున్నారు. – హుస్నాబాద్


పొన్నం ప్రభాకర్

- హుస్నాబాద్ కాంగ్రెస్‌పై నెలకొన్న ఆసక్తి
- ఇంకా ప్రకటించని పార్టీ అధిష్ఠానం
- ప్రచారం మొదలుపెట్టిన నాయకులు
- 'చలో కాళేశ్వరం' పేరిట పొన్నం
- వీరభద్ర స్వామి సన్నిధిలో ప్రచార రథాలతో అల్గిరెడ్డి ప్రవీణ్ రెడ్డి
- అయోమయంలో కార్యకర్తలు


అల్గిరెడ్డి ప్రవీణ్ రెడ్డి

హైదరాబాద్‌లోని తక్కుగూడలో జరిగిన రాహుల్ గాంధీ, సోనియాగాంధీ విజయభేరికి ఎవరికి వారే వాహనాల్లో కార్యకర్తలను తరలించారు. పార్టీ కార్యాలయాలను సైతం ప్రారంభించారు. 'తిరగబడుదాం..తరిమికొడదాం' అనే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎంపీ వి.హన్మంతరావు పాల్గొనగా, పొన్నం ప్రభాకర్, అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి ఇద్దరూ పాల్గొన్నారు. దీని తర్వాత ఆరు గ్యారెంటీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేదుకు నిర్వహించి సమావేశానికి ఏఐసీసీ సభ్యుడు మోహన్ ప్రకాశ్ రాగా, రెండు వర్గాల మధ్య గొడవ జరిగింది. దీంతో కాంగ్రెస్ పార్టీలో రెండు గ్రూపులుగా ఏర్పడడం కార్యకర్తల్లో అయోమయానికి గురి చేసింది. కాంగ్రెస్, సీపీఐ పొత్తులో భాగంగా హుస్నాబాద్ టికెట్ తమకే కేటాయించాలని సీపీఐ పార్టీ ఒత్తిడి తెస్తోంది. ఈ రెండు మూడు రోజుల నుంచి సీపీఐకి చెన్నూరు, కొత్తగూడెం సీట్లు కేటాయిస్తామని కాంగ్రెస్ చెప్పినట్లుగా ప్రచారం జరుగుతుండడంతో, హుస్నాబాద్ సీటు కాంగ్రెస్‌కే కేటాయిస్తారనే భావనతో టికెట్ కోసం పొన్నం ప్రభాకర్, ప్రవీణ్‌రెడ్డి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు.

చలో కాళేశ్వరం..

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోయిందని, ప్రాజెక్టులోని



లోపాలను ప్రజలకు చూపేందుకు పొన్నం ప్రభాకర్ చలో కాళేశ్వరం పేరిట వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మండలానికి ఒక బస్సు చొప్పున రైతులు, కాంగ్రెస్ నాయకులతో కాళేశ్వరానికి తరలివెళ్లారు. అలాగే మార్నింగ్ వాక్ పేరిట ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను ప్రచారం చేస్తూ ప్రజల మధ్యనే ఉంటున్నారు. ఇటీవలె కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో ప్రచార రథాలకు పూజలు చేయించి ప్రతి రోజూ ప్రచారం చేయిస్తున్నారు.

చాపకింది నీరులా ప్రచారం..

మరో వైపు మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్ రెడ్డి చాపకింద నీరులా ప్రచారం ఉధృతం చేస్తున్నారు. ఇప్పటికే నియోజకవర్గంలోని దాదాపు 90 గ్రామాలను చుట్టిముట్టి కాంగ్రెస్ ఆరు గ్యారెంటీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లారు. ఊరూరునా పరామర్శల పేరిట ఇంటింటికీ వెళ్తూ ప్రజలతో మమేకమవుతున్నారు. టికెట్ తనకే వస్తుందనే ధీమాతో కొత్తకొండ వీరభద్ర స్వామి దేవాలయంలో బుధవారం ప్రచార రథాలకు పూజలు నిర్వహించారు. నిత్యం ఏదో ఒక కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రజల మద్దతు కోసం ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు.

ఒకరికిస్తే మరొకరి మద్దతు ఉంటుందా?

కాంగ్రెస్ అధిష్ఠానం ఎవరికి టికెట్ ఇచ్చినా మరొకరి మద్దతు ఉంటుందా అనేది ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది. ఇద్దరు నేతలు ఎందులోనూ తగ్గకుండా సీరియస్‌గా ఎవరికివారే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పార్టీ ఇచ్చిన కార్యక్రమాలను తూచా తప్పకుండా చేస్తున్నారు. టికెట్ వచ్చిన తర్వాత ఇద్దరు చేతులు కలుపుతారా లేదా చేయి ఇస్తారా అనేది అంతుపట్టని పరిస్థితి నెలకొంది.

చిలుముల.. ఎప్పుడు మల్లా!

- నర్సాపూర్‌ను శాసించిన మదన్‌రెడ్డి వంశస్తులు
- 1957 నుంచి 2018 వరకు శాసనసభ ఎన్నికల్లో పోటీ
- ఈసారి బీఆర్ఎస్‌లో దక్కని టికెట్



కౌడిపల్లి(నర్సాపూర్): కౌడిపల్లి అడ్డాగా.. నర్సాపూర్ గడ్డపై రాజకీయాలను శాసించిన చిలుముల వంశం సుదీర్ఘ రాజకీయ చరిత్రకు నేటి నుంచి తెర పడనుందా... అంటే అవుననే అంటున్నారు రాజకీయ విశ్లేషకులు. నర్సాపూర్ నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు జరిగిన శాసన సభ ఎన్నికల్లో కౌడిపల్లికి చెందిన చిలుముల వంశస్తులు పోటీ చేస్తూ వచ్చారు. కానీ ప్రస్తుతం జరగనున్న ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేకు టికెట్ దక్కపోవడం చర్చనీయాంశంగా మారింది.

విఠల్‌రెడ్డితో మొదలుకొని..

దివంగత మాజీ ఎమ్మెల్యే, సీపీఐ నాయకులు చిలుముల విఠల్‌రెడ్డి నర్సాపూర్ రాజకీయాలను శాసించారు. 1952లో నర్సాపూర్ నియోజవర్గం ఏర్పడింది. 1957లో జరిగిన మొదటి ఎన్నికల్లో సీపీఐ తరఫున కౌడిపల్లికి చెందిన విఠల్‌రెడ్డి పోటీ చేశారు. 1957 నుంచి 2004 వరకు 11సార్లు శాసనసభకు ఎన్నికలు జరగగా విఠల్‌రెడ్డి పోటీలో ఉన్నారు. అయిదు సార్లు గెలుపొంది ప్రజాసేవ చేశారు. అనంతరం 2009లో మహాకూటమి ఏర్పడడంతో సీపీఐ తరఫున విఠల్‌రెడ్డి కుమారుడు చిలుముల కిషన్‌రెడ్డి పోటీలో నిలిచి ఓటమి చెందారు. అనంతరం 2014, 2018 ఎన్నికల్లో విఠల్‌రెడ్డి తమ్ముడి కుమారుడు చిలుముల మదన్‌రెడ్డి బీఆర్ఎస్ తరఫున పోటీ చేసి గెలుపొందారు. అంతకుముందు మదన్‌రెడ్డి తెలుగుదేశం తరఫున రెండు సార్లు పోటీచేసి ఓటమి చెందారు.

కాంగ్రెస్ నుంచి దక్కేదెవరికో..

ప్రస్తుతం మదన్‌రెడ్డికి పార్టీ అధిష్ఠానం టికెట్ ఇవ్వలేదు. కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన మాజీ మంత్రి, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డికి టికెట్ ఇచ్చి బీఫామ్ అందజేశారు. టికెట్ రాదని చర్చకు వచ్చినప్పటి నుంచి కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పలుమార్లు ఎమ్మెల్యే మదన్‌రెడ్డిని పార్టీలోనికి రావాలని ఆహ్వానించినట్లు చర్చ జరిగింది. రెండు రోజుల క్రితం విఠల్‌రెడ్డి కోడలు బీఆర్ఎస్ ఉమ్మడి మెదక్ జిల్లా మాజీ మహిళా అధ్యక్షురాలు సుహాసిని కిషన్‌రెడ్డి, ఆమె కొడుకు చిలప్‌చెడ్ మండల మాజీ జెడ్పీటీసీ శేషసాయిరెడ్డిని మైనంపల్లితో పాటు కాంగ్రెస్ నాయకులు పార్టీలోనికి ఆహ్వానించారు. దీంతో నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ టికెట్ చిలుముల వంశస్తులకు ఇస్తారా.. అని చర్చ జరుగుతుంది. ఇప్పటి వరకు కాంగ్రెస్ సైతం నర్సాపూర్ టికెట్ కేటాయించకపోవడంతో ఏదైనా జరగవచ్చని జనం అంటున్నారు.

అందోల్ ఎవరికో..

- గతంలో కాంగ్రెస్, టీడీపీ ప్రాబల్యం
- రెండు సార్లు బీఆర్ఎస్ విజయం
- అత్యధిక, అత్యల్ప రికార్డు మాత్రం దామోదర్‌దే..

వట్‌పల్లి(అందోల్): అందోలు నియోజకవర్గంలో ఇప్పటి వరకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులే ఎక్కువ సార్లు గెలుపొందారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 15 సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఇందులో కాంగ్రెస్ ఎనిమిది, టీడీపీ నాలుగు, బీఆర్ఎస్ రెండుసార్లు, ఒక ఇండిపెండెంట్ విజయం సాధించారు. అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలుపు, అతి తక్కువ ఓట్లతో ఓటమి చెందిన అభ్యర్థి రాజనర్సింహానే కావడం విశేషం.

- 1999లో జరిగిన సాధారణ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి బాబూమోహన్ చేతిలో దామోదర ఓటమి చెందారు. 2004లో బాబూమోహనను దామోదర్ ఓడించారు.
- 1978లో దామోదర్ తండ్రి రాజనర్సింహా ఇందిరా కాంగ్రెస్ అభ్యర్థి సదానంద్‌పై గెలుపొందారు. 2009 ఎన్నికల్లో బాబూమోహన్ ఓటమి చెందగా, 2014 ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున బాబూమోహన్ గెలిచారు.
- 2018 ఎన్నికల్లో చంటి క్రాంతికిరణ్ దామోదర రాజనర్సింహాపై గెలుపొందారు.
- 1962 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మీదేవి, 1972లో దామోదర రాజనర్సింహా గెలుపొందారు. 1983లో లక్ష్మణ్‌జీ, 1985లో దేశం అభ్యర్థి ఎం.రాజయ్య గెలుపొందారు.
- 1989 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సీ.దామోదర్ రాజనర్సింహ, 1998 ఉప ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి బాబూమోహన్ గెలుపొందారు.

అంతా అరచేతిలోనే...

ఎన్నికల్లో తొలిసారిగా యాప్ సాంకేతికత
- ఇంటి నుంచే అనుమతులకు 'సువిధ'
- పోటీ చేసే అభ్యర్థుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు..
- పౌరుల చేతిలో బ్రహ్మాస్త్రంగా 'సీ-విజిల్'

నారాయణఖేడ్: అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఈసీ తగిన ఏర్పాట్లు చేస్తోంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి పకడ్బందీ చర్యలు చేపడుతోంది. క్షణాల్లో సమాచారం అందుబాటులో ఉంచేందుకు యాప్‌లు, వెబ్‌సైట్లు తీసుకొచ్చింది.

సువిధ యాప్..

ఈ యాప్ పూర్తిగా ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ఉపయోగపడుతుంది. సింగిల్ విండో సిస్టం ద్వారా ఆన్‌లైన్‌లో ప్రచార వాహనాలకు, మైకు,



యాప్‌లపై అవగాహనకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఏర్పాటు చేయించిన కటౌట్

సభలు, సమావేశాలకు, తదితర అనుమతులు పొందేందుకు వీలుంటుంది. ఈ పోర్టల్ వినియోగించుకొని అభ్యర్థులు ఇంటి నుంచే అనుమతులు పొందవచ్చు. సంబంధిత నోడల్ అధికారి, సెక్షన్ అధికారులు, ఐటీ అధికారులు అందుబాటులో ఉంటారు. దరఖాస్తు ఆన్‌లైన్‌లో పొందుపర్చి పత్రాలను పరిశీలించి అన్ని సక్రమంగా ఉంటే అనుమతులు ఇస్తారు.

సభలు, సమావేశాలు నమోదు..

గూగుల్ ప్లే స్టోర్ ద్వారా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. తాము నిర్వహించే సమావేశం, తమకు ఏ విధమైన అనుమతులు అవసరమో వాటిని యాప్‌లో నమోదు చేయాలి. దరఖాస్తు ఎన్నికల అధికారులకు చేరిన 48 గంటల్లోనే అనుమతులు లభిస్తాయి. సాంకేతిక ఇబ్బందులు తలెత్తితే ప్రత్యామ్నాయంగా ఆర్‌ఓకు నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు. యాప్ ద్వారా సభా నిర్వహణ, సమావేశాల ఏర్పాటు, ర్యాలీలు, కార్లు, బైక్‌లు వినియోగించాల్సి ఉంటే ఆ వివరాలు, తాత్కాలిక ఎన్నికల కార్యాలయాల ఏర్పాట్లు, లౌడ్ స్పీకర్లు, జెండాలు, పోస్టర్ల వినియోగం, ఇంటింటి ప్రచారం తదితరాలు పొందవచ్చు.

నిఘా నేత్రంగా సీ-విజిల్..

ఎన్నికలు సజావుగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం సీ-విజిల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. నిఘా నేత్రంగా ఉపయోగపడే ఈ యాప్‌తో తమ ప్రాంతంలో నేతలు ప్రలోభాలకు గురిచేసినా, తాయిలాలు ఇచ్చినా వెంటనే ఫొటో, వీడియో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తే సరిపోతుంది. ఫిర్యాదు అందిన ఐదు నిమిషాల్లోనే జిల్లా ఎన్నికల అధికారి నియంత్రణలోని మానిటరింగ్ సెల్‌కు వెళ్తుంది. ఐదు నిమిషాల్లోనే ఘటనా స్థలికి ఎంసీసీ, ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందాలు చేరుతాయి. సదరు అధికారి క్షేత్రస్థాయికి వెళ్లి విచారణ చేస్తారు. ఆ నివేదికను 30 నిమిషాల్లో రిటర్నింగ్ అధికారికి పంపితే 50 నిమిషాల్లో పరిశీలిస్తారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటారు. కోడ్ ఉల్లంఘన జరగలేదని తేలితే ఆ ఫిర్యాదును యాప్ నుంచి తొలగిస్తారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను అధికారులు గోప్యంగా ఉంచుతారు.



కాంగ్రెస్ గెలుపు ఖాయం

పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి చంద్రశేఖర్

ఝరాసంగం(జహీరాబాద్): రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయమని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎ.చంద్రశేఖర్ ధీమా వ్యక్తం చేశారు. మండల పరిధిలోని జీర్లపల్లి గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. ఆయన మాట్లాడుతూ హామీల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. పార్టీ గెలుపు కోసం అందరూ సైనికులుగా పని చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ మండల అధ్యక్షుడు హన్మంత్‌రావు పాటిల్, సర్పంచ్ రాంరెడ్డి, మాణిక్‌రెడ్డి పాల్గొన్నారు.

పదేళ్లలో ప్రగతి ఏదీ?

- ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి చేసిందేమీ లేదు
- కాంగ్రెస్ అభ్యర్థి మైనంపల్లి రోహిత్

హవేళిఘణాపూర్(మెదక్): పదేళ్లుగా తమ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తారనే నమ్మకంతో మెదక్ ఎమ్మెల్యేగా పద్మాదేవేందర్‌రెడ్డిని గెలిపించుకుంటే కనీసం ప్రజల బాధలు విన్న పాపానపోలేదని మెదక్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి మైనంపల్లి రోహిత్ ఆరోపించారు. మండల పరిధిలోని ఖాజీపల్లి, పాశాపూర్, కోంటూర్, వెంకటాపూర్, గుట్టకిందిపల్లి, శివ్వాయిపల్లి గ్రామాల్లో ఆయన బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను ఆదరించి గెలిపిస్తే అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. గతంలో మైనంపల్లి స్వచ్ఛంద సేవా సమితి ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు. అందులో భాగంగా నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడి ఉన్న చోట బోర్లు వేయిస్తే వాటికి పర్మిషన్ లేదంటూ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అడ్డుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డికి అవినీతి తప్ప ప్రజలకు సేవ చేయాలనే ఆలోచన లేదని, అందులో భాగంగానే మెదక్‌ను దోచుకొని వేల కోట్ల రూపాయలు సంపాదించారని ఆరోపించారు. మరోమారు బీఆర్ఎస్‌ను నమ్మి ఓట్లు వేస్తే రాబోయే రోజుల్లో ఎమ్మెల్యే మనుషులే పెత్తనం చెలాయించి సామాన్య ప్రజలను అణగదొక్కడం ఖాయమని వాపోయారు. ఇప్పటికే అన్ని రంగాల్లో వెనుకబడిన మెదక్‌ను మంత్రి హరీశ్‌రావు ప్రభుత్వ కార్యాలయాలతో పాటు పోచారంలో ఉన్న జంతువులను వదలకుండా తరలించుకుపోతున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నాగరాజు, హఫిజొద్దీన్, శంకర్‌తో పాటు మండలంలోని ఆయా గ్రామాల పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మైనంపల్లి రోహిత్

మాట ప్రకారం 'గౌరవెల్లి' పూర్తి

ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీష్‌కుమార్

అక్కన్నపేట(హుస్నాబాద్): గౌరవెల్లి ప్రాజెక్టు నిర్మాణంలో ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా మాట ప్రకారం పూర్తి చేశామని ఎమ్మెల్యే వొడితెల సతీష్ కుమార్ అన్నారు. అక్కన్నపేట మండలంలోని గండిపల్లి, పంచరాయి తండా, అమ్మతండా, ధాక్యనాయక్‌తండా, సరిరాంతండా, రామవరం, బంగారులొద్దుతండా, చౌటకుంటతండా, కుందనవానిపల్లి, మైసమ్మవాగుతండా, మబ్బుకుంటతండా, బొడిగెపల్లి, గౌరవెల్లి, కెప్టెన్ కాలనీ, జనగామ గ్రామాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో మహిళలు కోలాటాలు, బతుకమ్మ బోనాలు, డప్పుచప్పులతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తిచేశామని, కానీ ప్రతిపక్షాలు ప్రారంభించకుండా కుట్రలు వేసి ఎన్జీటీలో కేసులు వేయించారన్నారు. మూడోసారి బీఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పలు గ్రామాల్లో యువకులు పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ మాలోతు లక్ష్మీ, జెడ్పీటీసీ సభ్యులు భూక్య మంగ, గ్రామాల సర్పంచ్ వంగపల్లి సృజన, వనపర్తి స్వప్న, సందెబోయిన లావణ్య, అన్నాడీ దినేష్‌రెడ్డి, కత్తుల మానస, ఎంపీటీసీలు, లింగాల శ్రీనివాస్, భానోతు ప్రమీల, వొద్దిరాల సునీత, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పెసరు సాంబరాజు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కుడి ఎడమైతే.. పొరపాటు లేదోయ్!

నాటి ప్రత్యర్థులే నేటి ప్రచారకర్తలు ● మెదక్‌లో విచిత్ర రాజకీయం


ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డితో కలసి ప్రచారం చేస్తున్న తిరుపతిరెడ్డి


ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డితో మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, మామిళ్ల ఆంజనేయులు

మెదక్: కుడి ఎడమైతే పొరపాటు లేదోయ్ అన్నాడో మహాకవి. ప్రస్తుతం మెదక్‌లో చోటుచేసుకుంటున్న రాజకీయ పరిణామాలు, నేతల వ్యవహారశైలి చూస్తుంటే ఇది కరెక్టే అనిపిస్తోంది. నిన్నటి వరకు ప్రత్యర్థులుగా ఉన్న నేతలు.. ఇప్పుడు దోస్తులుగా మారడం, వారి తరఫున ప్రచారం చేయడం చర్చనీయాంశంగా మారింది. మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడుతిరుపతిరెడ్డి, పీసీసీ సభ్యుడు మామిళ్ల ఆంజనేయులు ముగ్గురు మెదక్ కాంగ్రెస్ పార్టీ టికెట్ ఆశించి భంగపడ్డారు. దీంతో మంత్రి హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ప్రత్యర్థులుగా ఉన్న సమయంలో సిట్టింగ్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డిపై పోటీ చేయాలనుకున్నవారు ప్రస్తు తం ఆమెకే ఓటు వేయాలని కోరడం కొసమెరుపు.

హామీలు నెరవేరుస్తాం

అందోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్


బీఆర్ఎస్ మేనిఫెస్టో చూపుతున్న క్రాంతికిరణ్

టేక్మాల్(మెదక్): గ్రామాల్లో మునుపెన్నడూ లేనంతగా అభివృద్ధి చేసిన కేసీఆర్ ప్రభుత్వానికి పట్టంకట్టాలని అందోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ ప్రజలను కోరారు. ఎన్నికల్లో భాగంగా బుధవారం టేక్మాల్ మండలంలోని కాద్లూర్, సాలోజిపల్లి, తంప్లూర్, ఎల్లంపల్లి గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాద్లూర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, పార్టీ జెండావిష్కరణ చేశారు. తంప్లూర్‌లో బైక్‌ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఫారుఖ్ హుస్సేన్, జైపాల్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు భక్తుల వీరప్ప, ప్రధాన కార్యదర్శి అవినాశ్, పీఏసీఎస్ చైర్మన్ యశ్వంత్‌రెడ్డి, సర్పంచ్‌లు జ్యోతి బన్సిలాల్, హర్షబేగం, సంగయ్య, సత్యం, నాయకులు భాస్కర్, బసంత్‌రావు, మల్లేశం, రాజేందర్, చంద్రశేఖర్, శ్రీధర్‌రెడ్డి, సిద్దయ్య, సలీమ్, బొట్లసత్యం, చంద్రశేఖర్‌రెడ్డి, మాణెయ్య, విష్ణు, రంజిత్‌రెడ్డి, మహేందర్, యాదయ్య, గోవిందచారి, మాణిక్యం, సాయిలు, సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

సొంత నిధులతో అభివృద్ధి పనులు

- ప్రభుత్వం సహకారం శూన్యం
- దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు

చేగుంట(తూప్రాన్): గెలిచిన రెండున్నర ఏళ్లుగా ప్రభుత్వం తనకు సహకరించకున్నా తన సొంత డబ్బుతో మండలంలో అభివృద్ధి కోసం పనిచేస్తున్నట్టు దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. మండలంలోని చందాయిపేట, కసాన్‌పల్లి, అనంతసాగర్, ఉల్లితిమ్మాయిపల్లి గ్రామాల్లో బుధవారం ఆయన ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అనంతసాగర్ గ్రామంలో మహిళ సంఘం భవనం, డ్రైనేజీల నిర్మాణం కోసం తన జీతం డబ్బులు విరాళంగా ఇచ్చినట్లు చెప్పారు. చేగుంట–గజ్వేల్ రోడ్డు మరమ్మతుల కోసం ఎంతో శ్రమించానని, అలాగే రెడ్డిపల్లి బైపాస్ వద్ద జాతీయ రహదారిపై బ్రిడ్జి నిర్మాణానికి కేంద్రం నుంచి నిధులు మంజూరు చేయించానని చెప్పారు. అదేవిధంగా కసాన్‌పల్లి శివారు మీదుగా మాచిన్‌పల్లి హనుమాన్ ఆలయం నుంచి జాతీయ రహదారి వరకు రోడ్డు నిర్మాణం కోసం రూ.2.50 కోట్లు నిధుల కోసం ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. నిరంతరం దుబ్బాక అభివృద్ధిని కోరుకునే తనకు ఓటు వేసి గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. గజ్వేల్‌తో సమానంగా దుబ్బాక నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు భూపాల్, జిల్లా నాయకులు వెంగళ్‌రావు, వైస్ ఎంపీపీ రాంచంద్రం మాజీ సర్పంచులు జగన్‌గౌడ్, నాగభూషణం, రఘువీర్‌రావు, నగేశ్, మాజీ ఎంపీపీ పాండు, మహిళ మోర్చా నాయకులు జ్యోతి, రమ్య, వీరమణి, పద్మ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రఘునందన్‌రావు